## క్లుప్తంగా

### సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ అదనపు పని భారం వలన ఆశా కార్యకర్తలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. తాడేపల్లి, పుంగనూరులలో ఆశా కార్యకర్తల మృతి బాధాకరమన్నారు. మృతి చెందిన ఆశా కార్యకర్తలకు నష్టపరిహారంగా 50 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుభాషిని, జిల్లా ఉపాధ్యక్షులు అమ్ములు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కంటి వైరస్‌పై జాగ్రత్తలు పాటించాలి

కడప రూరల్: కంటికి సంబంధించిన వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని కంటి వైద్యులు ఆసిఫ్‌బాష అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎం ఆసుపత్రిలో జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో కంటి వైరస్‌పై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కంటికి సంబంధించిన వైరస్‌లు సోకుతున్నాయని తెలిపారు. కంటి దురద, మంట తదితర లక్షణాలు ఉంటే తక్షణం కంటి వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

### శిల్పారామంలో నృత్యాలు



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. కమలాపురానికి చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గీతాలతోపాటు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేసి వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.

### నేడు జాబ్‌మేళా

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్‌రోడ్డులోని స్పిరిట్ కాలేజీలో నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెట్ వారు సేల్స్ రెప్రజెంటేటివ్స్ ఉద్యోగాలకు సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపికలు నిర్వహిస్తారని ఆ కళాశాల డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. అభ్యర్థులు 19 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి ఏదైనా డిగ్రీ చదివి ఉండాలని తెలిపారు. ఎంపికలకు వచ్చే అభ్యర్థులు తమ వెంట బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు కాలేజీ ప్లేస్‌మెంట్ అధికారి మునీర్ (98852 50955)ను సంప్రదించాలని డైరెక్టర్ రవీంద్ర తెలిపారు.

### 11న జగనన్నకు చెబుదాం

వల్లూరు : మండల కార్యాలయాల సముదాయ ఆరణలో ఈనెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మండల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### నేడు మండల సమావేశం

వల్లూరు : మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకం, తాగు నీరు, పారిశుద్ధ్యం, వ్యవసాయం, ప్రజా పంపిణీ వ్యవస్థ, విద్యుత్ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్‌లు హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

### రేపు తప్పెట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

వల్లూరు : మండలంలోని తప్పెట్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో వైద్య నిపుణులు వైద్య సేవలను అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని ఆమె కోరారు.

### బీజేపీ జిల్లా లీగల్ కన్వీనర్‌గా శివకుమార్



కడప కోటిరెడ్డిసర్కిల్: తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన గామిరెడ్డి శివకుమార్‌ను వైఎస్సార్ కడప జిల్లా బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమించారు. జిల్లా లీగల్ కన్వీనర్‌గా అవకాశం కల్పించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డికి శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శివకుమార్ కడప జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

# అభివృద్ధిని ప్రతి ఇంటికీ తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

**ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా**

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వం చేస్తున్న అసలైన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో సౌత్ జోన్(క్లస్టర్–3) పరిధిలోని కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. మొదట దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నెల రోజుల పాటు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా సచివాలయ శిబిరాలు నిర్వహించి, ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రదర్శించాలన్నారు. జగనన్న ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చారు, చంద్రబాబు హామీలు ఇచ్చి ఎలా మాట తప్పారనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి సచివాలయంలో ఒక రోజు గడిపి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించాలని, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. గ్రామ, వార్డు పెద్దలతో డిన్నర్, రాత్రి బస వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ముందుండి నడిపించాలని, కార్పొరేటర్లను భాగస్వామ్యం చేయాలన్నారు. క్లస్టర్–3 ఇన్‌చార్జి తోటక్రిష్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనందరం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, మల్లికార్జున, నాగేంద్ర, కె. సూర్యనారాయణరావు, డివిజన్ ఇన్‌చార్జులు ఏ. బాలక్రిష్ణారెడ్డి, ఆర్‌వీ రమణ, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**తోటక్రిష్ణకు సన్మానం**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సౌత్ జోన్(క్లస్టర్–3) అధ్యక్షుడిగా తోటక్రిష్ణాంజనేయులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

### పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

బద్వేలు అర్బన్: పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాల ఆవరణలో రీజనల్ కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన బద్వేలు రీజియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### ముగిసిన ఉత్సవాలు



పోరుమామిళ్ల: పట్టణంలోని ఆర్‌సీయం చర్చి ఆవరణలో జపమాలరాజ్ఞి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా విజయభాస్కర్, రాజేంద్ర ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. శనివారం రాత్రి కడప మేత్రాసన కథోలిక పీఠాధిపతి గాలిబాలి పాల్గొని ప్రజలకు సందేశమిచ్చారు. ఈ సందర్భంగా పుల్లయ్య, ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చెక్కభజన, కులుకు భజన, కోలాటం ఆకట్టుకున్నాయి. పోరుమామిళ్ల క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారిశాల ఆవరణలో ఏర్పాటవుతున్న పందిరి



శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్చి



గడ్డిబజారు ఆలయం వద్ద ప్రారంభమైన ఆర్చి నిర్మాణ పనులు

కడప కల్చరల్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు కేవలం ఐదు రోజులే గడువు ఉంది. దీంతో ఉత్సవాలు నిర్వహించే ఆలయాలలో సన్నాహాలు మొదలయ్యాయి. పందిళ్లు, ఇతర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దసరా పండుగ అనగానే సరదాలు, సందళ్లు గుర్తుకొస్తాయి. ప్రొద్దుటూరు తర్వాత జిల్లాలో కడప నగరంలో అంత భారీ స్థాయిలో దసరా పండుగను నిర్వహిస్తారు.

– స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం(అమ్మవారిశాల)లో ఈ పండుగను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు ప్రారంభించారు. ఇతర రాష్ట్రాల కార్మికులను రప్పించి వారం క్రితం నుంచే భారీ పందిళ్ల నిర్మాణం మొదలెట్టారు. నగరంలోని ఇతర అమ్మవారి దేవాలయాలలో కూడా ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించారు. పెద్ద ఆలయాలలో ఇప్పటికే నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి గనుక ప్రజలకు ఇబ్బంది లేకుండా పందిళ్లకు దిగువన ప్లాస్టిక్ షీట్లు ఏర్పాటు చేస్తున్నారు.

– హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగుళూరు తదితర పెద్ద నగరాల నుంచి ఉత్సవాలకు సంబంధించి కార్యక్రమాలను రోజువారి వివరాలతో రంగురంగుల బుక్‌లెట్లను ముద్రింపజేశారు. ఆ బుక్‌లెట్లు ఇప్పటికే ఆయా ఆలయాలకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల దాతలు, ధర్మకర్తలు, ఉభయదారులకు బుక్‌లెట్లను అందజేసి వారి పేరిట నిర్వహించనున్న పూజకు హాజరు కావాలని తేదీ, సమయాలను ముద్రించి ఉండటాన్ని వివరిస్తూ పంపిణీ చేస్తున్నారు.

**శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో.**

కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో కూడా దసరా పండుగను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ ఆవరణలో, ప్రధాన ద్వారం వద్ద ఆకర్శణీయంగా స్వాగత తోరణాలను తీర్చిదిద్దుతున్నారు. ఉత్సవాలు జరుగుతున్నంత కాలం ప్రతిరోజు అమ్మవారి ఆనాటి అలంకారాన్ని రంగురంగుల విద్యుత్ దీపాల కటౌట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆలయం హైవేలో ఉండడంతో ప్రతిష్ఠాత్మకంగా ఆలయం వెలుపలి ప్రాంతాన్ని పూర్తిగా డిజిటల్ బోర్డులు, విద్యుత్ దీపాలతో ఆకర్శణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

– గడ్డిబజారు శివాలయం, శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయాలలో కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయం వెలుపల ప్రత్యేక ఆర్చిలు, స్వాగత తోరణాలను కార్మికులు రేయింబవళ్లు తీర్చిదిద్దుతున్నారు. ఆ సమీపంలోని భద్రావతి భవనారుషి ఆలయం, నడివీధి గంగమ్మ, బాల పోలేరమ్మ ఆలయాలను కూడా ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఎర్రముక్కపల్లె, నబీకోట ప్రాంతాలలోని ఆలయాలు కూడా ఉత్సవాలకు ముస్తాబు అవుతున్నాయి. శ్రీ లలిత పంచాయతన ఆలయంలో నిర్వాహకులు స్వామి తురియానంద పర్యవేక్షణలో నవరాత్రుల్లో వినూత్నమైన ఆకర్షణలు ఉండేలా ఆలయంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## త్వరలో అన్నమయ్య జిల్లాలో ఇంటాక్ ఏర్పాటు

**– జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య**



అవార్డు గ్రహీతలతో అతిథులు

కడప కల్చరల్ : త్వరలో అన్నమయ్య జిల్లాలో కూడా భారత జాతీయ కళా వారసత్వపరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఏర్పాటు కానుండడం సంతోషదాయకమని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పర్యాటకానికి పట్టాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వల్లూరు బ్రహ్మయ్య, గౌరవ అతిథి వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పలు ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతాలున్నాయన్నారు. సభాధ్యక్షులు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఒంటిమిట్ట నుంచి కుక్కల దొడ్డి వరకు ఎన్నో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. కాగా ఇటీవల రాష్ట్ర టూరిజం శాఖ నుంచి మూడవసారి ఉత్తమ పర్యాటక పాత్రికేయుడుగా అవార్డు అందుకున్న పవన్ కుమార్ పంతుల, ఉత్తమ పర్యాటక ఫోటోగ్రాఫర్ గా అవార్డు స్వీకరించిన కొండూరు జనార్దన రాజు, ఇంటాక్ జాతీయ కార్యశాలకు ఎంపికై ప్రత్యేక శిక్షణ పొంది వచ్చిన సభ్యులు గునిశెట్టి శ్రీనివాసులు, బోగాల కొండారెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన కల్లూరు బాల ఎల్లారెడ్డిలను ఈ సందర్భంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్, లయన్స్ క్లబ్ సంస్థలతో కలిసి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి పై మూడు సంస్థల సభ్యులు, పర్యాటక శాఖ అభిమానులు తదితరులు హాజరయ్యారు.

## వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చిన్నమండెం జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్‌లను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం హెచ్‌ఎం శ్రీరాములు అధ్యక్షతన వేడుకగా జరిగింది. వంద మంది పూర్వ విద్యార్థులకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పండుగ వాతావరణంలో తమ మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. తమ జ్ఞాపకాలకు గుర్తుగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఒక కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, వారి బంధువులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 29న ప్రొద్దుటూరు హాఫ్ మారథాన్

**– ఐఆర్ఎస్ అధికారి రామనాథరెడ్డి**

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో ఈ నెల 29న ఉదయం ఆరు గంటలకు హాఫ్ మారథాన్–2023 నిర్వహించనున్నట్లు ఐఆర్ఎస్ అధికారి ఉండేల రామనాథరెడ్డి తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిని కార్యక్రమంలో క్రీడాకారుల టీ షర్ట్స్, మెడల్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని 2023 ఐరన్ మ్యాన్ రన్ ఫర్ యూనిటీని రాయల్ కౌంటీ బైపాస్ వద్ద నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. దీంతో పాటు ఐదు, పది, 21.1 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహిస్తామని, ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. 5 కిలోమీటర్ల పందెం విజేతలకు వరుస బహుమతులుగా రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, పది కిలోమీటర్ల విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, 21.1 కిలోమీటర్ల విభాగంలో విజేతలకు రూ.21 వేలు, రూ.16 వేలు, రూ.10 వేలు ఇస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులందరికీ టీ షర్ట్స్, నిర్దేశిత దూరం పూర్తిచేసిన వారికి మెడల్స్, ప్రశంశా పత్రం అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 15వ తేదీలోగా పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాంష్ ట్రస్ట్ కోశాధికారి వద్ది మురళి, కోనేటి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవి శంకర్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం



మైదుకూరులో సెల్ ఫోన్లను తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ మస్తాన్



లాడ్జీలో దిగిన వ్యక్తులతో మాట్లాడుతున్న సీఐ

ప్రొద్దుటూరు క్రైం: క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పలు ప్రాంతాల్లోని లాడ్జీలు, ఇతర ప్రాంతాల్లో ఆదివారం సోదాలు జరిపారు. ప్రొద్దుటూరులో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు క్రికెట్ బెట్టింగ్, మట్కాపై సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, రమణారెడ్డి, సిబ్బంది చర్యలు చేపట్టారు. లాడ్జిలో తనిఖీలు చేసి రిజిష్టర్లు పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. కడప స్పెషల్ పార్టీ, ప్రొద్దుటూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి పలు చోట్ల క్రికెట్ బుకీల ఇళ్లలో సోదాలు చేశారు. కొందరిని అదుపులోకి తీసుకుని ఎస్పీ ఎదుట హాజరు పరిచారు. క్రికెట్ పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**పోరుమామిళ్లలో**

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు తీసుకున్నారు. లాడ్జీ యజమానుల వారి వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసి పూర్తి ఆధారాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రుమంలో కలసపాడు ఎస్ఐ నాగమురళి, కాశినాయన ఎస్ఐ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు: మైదుకూరులో లాడ్జిలలో, అనుమానం ఉన్న ప్రదేశాల్లో అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ సోదాలు జరిపారు. అనుమానాస్పద వ్యక్తులు వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**బద్వేల్‌లో..**

బద్వేల్ అర్బన్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ సీఐ పి.యుగంధర్ హెచ్చరించారు. ఎస్పీ సిద్దార్థకౌశల్ ఆదేశాల మేరకు మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ పర్యవేక్షణలో ఆదివారం పట్టణంలోని లాడ్జీలు, బుకీల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉమ్మకాపు.. భలే



యార్డులో ఉన్న ఉమ్మకాపు కాయలు



చెట్టుకు ఉన్న ఉమ్మకాపు కాయలు

**– అధిక ధరలు అమ్ముతున్న మామిడి**

రైల్వేకోడూరు అర్బన్: ఈ ఏడాది మామిడి కాయల వ్యాపారం అంతంత మాత్రంగా జరిగింది. వేసవికాలం ఎండలు అధికంగా ఉండటం వల్ల ఏప్రిల్, మే నెలల్లో మామిడిపంట పిందె దశలో రాలిపోయి మామిడికాయల కాపు అంతంత మాత్రంగా వచ్చింది. రైల్వేకోడూరు మార్కెట్ యార్డులో యేటా కోట్లలో వ్యాపారాలు జరిగేవి. అయితే ఈ యేడాది మామిడి అంతంత మాత్రంగా ఫలితాలు వచ్చాయి. మామిడి సీజన్ ముగిశాక సెప్టెంబర్, అక్టోబర్ నెలలో వచ్చే కొన్ని రకాల ఉమ్మకాపు మామిడి కాయల ధరలకు ఊపు వచ్చింది. కిలో 50 రూపాయల నుండి 60 రూపాయల వరకు రైతులకు ధర ఇస్తున్నారంటే డిమాండ్ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్‌లో మాత్రం 100 రూపాయలు అమ్ముతున్నారు. కొందరు రైతులు ఉన్న కొన్ని మామిడికాయలను యార్డుకు తరలిస్తున్నారు. మరికొందరు మాత్ర ఆటోలలో తిరుపతి మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు.

**పంట లేనప్పుడు ధరలు ఉంటాయి**

సాధారణంగా మామిడి పంట ఉన్నప్పుడు ఇదే 50, 60 రూపాయల ధరలు ఉంటే రైతులకు కనక వర్షమే. కానీ ఈ ధరలు దిగుబడి వచ్చేటప్పుడు ఉండవు. కొంత మేరకే ఉమ్మకాపు వచ్చినా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పెట్టుబడులకు సహాయంగా ఉంటాయి.

– మల్లు రఘురామిరెడ్డి, రాఘవరాజపురం, కోడూరు మండలం

### పోలీసుల తనిఖీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్స్, ప్రైవేట్ హాస్టల్‌లను ఆదివారం ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి, పెండ్లిమర్రి ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిలు తమ సిబ్బందితో పలు ప్రాంతాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఫంక్షన్ హాల్స్, ప్రైవేటు హాస్టల్స్‌లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా సంబంధిత యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గమనించి తమకు సమాచారం అందించాలన్నారు. హాస్టళ్లు, ఫంక్షన్ హాళ్లలో మద్యం సేవించడానికి, పేకాట ఆడటానికి ప్రయతిస్తే ఎప్పటికప్పుడు నిఘావుంచి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీకే దిన్నె ఏఎస్ఐ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

### సేవా దృక్పథం అభినందనీయం

కడప కల్చరల్ : ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి సేవాభావం అభినందనీయం అని సోషల్ వెల్ఫేర్ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం చెన్నూరు బస్టాండులోని రామకృష్ణమఠంలో నెమలిదిన్నె నాగవేణి ఆధ్వర్యంలో 100 మంది మూగ, బధిర, అంధ బాలికలు, బాల వికాస్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ బాలికలు, మహిళా క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వల్లూరు బ్రహ్మయ్య పాల్గొని ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు. ఆశారేఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని సేవా కార్యక్రమాల్లోనూ ఈ చిన్నారులు క్రమం తప్పకుండా పాల్గొంటూ తమవంతు సహకారం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌వీఎస్ ప్రసాద్

కడప కోటిరెడ్డి సర్కిల్/అర్బన్: విశ్రాంత అటవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర విశ్రాంత అటవీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో కడప అటవీ అతిథిగృహ ఆవరణలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత అటవీ ఉద్యోగులకు చాలామందికి ఫించన్లు అందడం లేదని, అలాగే వారికిఆర్థిక బెనిఫిట్లు రావడం లేదని తెలిపారు. ఈసమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం 70 సంవత్సరాలు దాటిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు, కార్యదర్శి గాలిబ్, రాష్ట్రకోశాధికారి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

### అనంతపురం గంగమ్మ దేవతకు భక్తుల పూజలు

లక్కిరెడ్డిపల్లి: వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు గంగమ్మతల్లీ అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతో పాటు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.